# రైతుల అభివృద్ధే బీఆర్‌ఎస్ లక్ష్యం



లింగాపూర్ గ్రామంలో సింగిల్ విండో గోదాంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

- రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్
- లింగాపూర్‌లో సింగిల్ విండో గోదాం ప్రారంభం

శంకరపట్నం, అక్టోబర్ 7: తెలంగాణ రాష్ట్రంలో రైతుల అభివృద్ధే లక్ష్యంగా సీఎం కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం పని చేస్తున్నదని రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ పేర్కొన్నారు. ఇందులో భాగంగానే దేశంలోనే ఎక్కడా లేని పథకాలు అమలు చేస్తున్నదని గుర్తు చేశారు. శనివారం మెట్‌పల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని ఆముదాలపల్లి, లింగాపూర్ గ్రామాల్లో నూతనంగా నిర్మించిన గోదాముల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులకు అండగా నిలుస్తున్నదన్నారు. విత్తనాలు, పురుగుమందులు, ఎరువులను అందుబాటులో ఉంచుతూ సాగును ప్రోత్సహిస్తున్న ఏకైక ప్రభుత్వం బీఆర్‌స్సేనన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రసమయి యువకులకు స్పోర్ట్స్ కిట్లు, మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ లింగంపల్లి శ్రీనివాస్ రెడ్డి, మెట్‌పల్లి పీఏసీఎస్ చైర్మన్ పొద్దుటూరి సంజీవరెడ్డి, ఆముదాలపల్లి సర్పంచ్ బత్తుల మానస, ఉప సర్పంచ్ జంపయ్య, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు పెద్ది శ్రీనివాస్ రెడ్డి, లింగాపూర్ సర్పంచ్ అంతం వీరారెడ్డి, గద్దపాక పీఏసీఎస్ చైర్మన్ గుర్రాల తిరుపతి రెడ్డి, ఆర్‌బీఎస్ జిల్లా డైరెక్టర్ అంతం తిరుపతిరెడ్డి, సొసైటీ కార్యవర్గ సభ్యులు, సీఈవో సదయ్య, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

## శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజాప్రతినిధుల సహకారం అవసరం

చిగురుమామిడి, అక్టోబర్ 7: మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజాప్రతినిధుల సహకారం ఎంతో అవసరమని ఎస్‌ఐ రాజేశ్ అన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం శనివారం మండలంలోని ప్రజాప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ, గ్రామాల్లోనే సాధ్యమైనంత వరకు సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేయాలన్నారు. దొంగతనాలను నియంత్రించేందుకు గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు ఎంతో అవసరమన్నారు. గ్రామాల్లోని యువత మద్యం, జూదం లాంటి చెడు అలవాట్లకు బానిస కాకుండా చూడాలన్నారు. యువత డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదని సూచించారు. కార్యక్రమంలో అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎల్ ఈడీ బల్బులను సద్వినియోగం చేసుకోవాలి



27వ వార్డులో ఎల్ ఈడీ బల్బులు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ తాళ్లపల్లి శ్రీనివాస్

హుజూరాబాద్‌టౌన్, అక్టోబర్ 7: ఇంటింటికీ అందిస్తున్న ఎల్‌ఈడీ బల్బులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కౌన్సిలర్లు తొగరు సదానందం, ముక్క రమేశ్ సూచించారు. శనివారం ఆయా వార్డుల్లో ఎల్‌ఈడీ బల్బులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎల్‌ఈడీ బల్బుల వినియోగంతో విద్యుత్‌ను ఆదా చేయవచ్చని తెలిపారు. ఆదివారం సైతం పంపిణీ కార్యక్రమం కొనసాగుతుందని చెప్పారు. నిర్మల ఎంటర్ ప్రైజెస్ తరఫున ఐదు ఎల్‌ఈడీ బల్బులు మూడేండ్ల వారంటీతో ఇస్తున్నారని తెలిపారు. 12వ వార్డులో ఆర్‌టీసీ దేవేందర్‌రెడ్డి ఇంటి వద్ద ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు, 29వ వార్డులో కాకతీయ కళాశాల వద్ద బల్బుల పంపిణీ కొనసాగుతుందని చెప్పారు. 90 రోజుల వ్యవధిలోని ఏదో ఒక నెల కరెంట్ బిల్ పేపర్ తీసుకొని వచ్చి 125 రూపాయలు చెల్లించి, ఐదు ఎల్‌ఈడీ బల్బులు పొందవచ్చని తెలిపారు.

## భూత వైద్యం పేరిట మోసగిస్తే చట్టరీత్యా చర్యలు

శంకరపట్నం, అక్టోబర్ 7: భూత వైద్యం పేరిట ప్రజలను మోసగిస్తే కఠిన చర్యలు తప్పవని కేశవపట్నం ఎస్‌ఐ పీ లక్కారెడ్డి హెచ్చరించారు. మొలంగూర్ గ్రామంలో కొందరు వ్యక్తులు అమాయక ప్రజలను భూత వైద్యం పేరుతో మాయ మాటలు చెప్పి తాయత్తుల కడుతూ వారి నుంచి డబ్బులు తీసుకుంటున్నారనే సమాచారం ఎస్‌ఐ దృష్టికి రాగా, ఆయన వెంటనే విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా మొలంగూర్ గ్రామానికి చెందినా నలుగురిని అదుపులోకి తీసుకుని తహసీల్దార్ అనుపమారావు ఎదుట హాజరు పరిచారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మండల ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. భూత వైద్యం పేరుతో మోసగించే వారి మాయమాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. పిల్లలు, పెద్దలకు ఏమైనా ఆరోగ్య సమస్య వస్తే క్వాలిఫైడ్ డాక్టర్‌ను సంప్రదించలే తప్ప నాటు వైద్యం చేసే వారిని, బాబాలు, తాయెత్తులు కట్టే భూత వైద్యులను ఎవరూ ఆశ్రయించవద్దని తెలిపారు. ఎవరైనా భూతవైద్యం పేరిట నేరాలకు పాల్పడితే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్‌ఐ హెచ్చరించారు



మాట్లాడుతున్న సీపీ సుబ్బారాయుడు

## శారీరక దృఢత్వంపై దృష్టి సారించాలి

- కరీంనగర్ సీపీ సుబ్బారాయుడు

తిమ్మాపూర్, అక్టోబర్ 7: విద్యార్థులు శారీరక దృఢత్వంపై దృష్టి సారించాలని సీపీ సుబ్బారాయుడు సూచించారు. మండలంలోని రామకృష్ణ కాలనీలో గల వాగేశ్వరి ఇంజినీరింగ్ కళాశాలలో మహిళలు, పురుషులకు బాడీ బిల్డింగ్ పోటీలు, బెస్ట్ ఫిజిక్ పోటీలను శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల విద్యార్థులకు కూడా బాడీ బిల్డింగ్‌పై ఆసక్తి కలుగుతుందన్నారు. చదువులో రాణించాలంటే ముందుగా శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండాలని, దానికి ఎక్సర్‌సైజ్, ఫిట్‌నెస్ ముఖ్యమని తెలిపారు. పోటీల్లో పాల్గొన్న వారిని అభినందించారు. కార్యక్రమంలో కళాశాలల సెక్రటరీ డాక్టర్ శ్రీనివాసరెడ్డి, జాయింట్ సెక్రటరీ డీ శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్లు వినోద్, ప్రకాశ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, ప్రోగ్రాం చైర్మన్ గులాబ్ సింగ్ హన్, బాడీ బిల్డింగ్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ దామోదర్, విభాగాధిపతులు, తదితరులు పాల్గొన్నారు.



పోటీల్లో పాల్గొన్న యువకులు

## సంపద వనానికి స్థల పరిశీలన

చిగురుమామిడి, అక్టోబర్ 7: మండలంలోని ఇందుర్తి గ్రామంలో సంపద వనం ఏర్పాటుకు శనివారం ఎంపీపీ కొత్త వినీతా శ్రీనివాస్ రెడ్డి, పంచాయతీ రాజ్ డీఈ రవికుమార్, ఎంపీడీవో నర్సయ్య ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. 937 సర్వే నెంబర్‌లో 3 ఎకరాల భూమిని అనువైనదిగా గుర్తించారు. అందులో రెండు వేల పండ్ల మొక్కలను పెంచేందుకు ప్రణాళికలను రూపొందిస్తున్నట్లు వారు తెలిపారు. గ్రామపంచాయతీ ఆదాయాన్ని పెంపొందించేందుకు గానూ ప్రభుత్వం సంపద వనాన్ని ఏర్పాటు చేస్తున్నదని వెల్లడించారు. వీరి వెంట ఇన్‌చార్జి ఏపీవో రాజయ్య, టీఏ వెంకటేశ్, ఫీల్డ్ అసిస్టెంట్ తదితరులున్నారు.



ఇందుర్తిలో స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ, అధికారులు



ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేస్తున్న యునాని వైద్యాధికారి (ఫైల్)

## 'ఆయుష్'కు పెరుగుతున్న ఆదరణ

- చిగురుమామిడిలో యునాని, ఇందుర్తిలో ఆయుర్వేద వైద్య సేవలు
- సద్వినియోగం చేసుకుంటున్న గ్రామీణులు

చిగురుమామిడి, అక్టోబర్ 7: ప్రభుత్వం ఆయుష్ దవాఖానల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో వైద్యం కోసం వచ్చే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నది. ఆయుష్ కింద ఆయుర్వేదం, యోగా, ప్రకృతి వైద్యం, యునాని, సిద్ధ, హోమియోపతి వైద్యం అందిస్తున్నారు. మండల ఆరోగ్య కేంద్రంలో యునాని, ఇందుర్తిలో ఆయుర్వేద దవాఖానలు ఉండగా, ఆయా చోట్ల చికిత్స తీసుకునేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. నిత్యం 30 మందికి పైగా ఆయా చోట్ల వైద్యులను సంప్రదించి, చికిత్స తీసుకుంటున్నారు. చర్మ వ్యాధులు, తలనొప్పి, కీళ్ల నొప్పులు, అలర్జీ, కండరాల బలహీనత మొదలైన సమస్యలతో ఎక్కువమంది దవాఖానకు వస్తున్నట్లు యునాని వైద్యాధికారి అప్సానా తెలిపారు.

**విస్తృతంగా అవగాహన:** గ్రామాల వారీగా ఆయుష్ వైద్య విధానంపై సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. సంప్రదాయ వైద్య విధానం వల్ల కలిగే లాభాలను వివరిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో వైద్య శిబిరాలు నిర్వహించి విద్యార్థులకు ఉచితంగా మాత్రలు అందజేస్తున్నారు. ఇప్పటికే మండలంలోని అన్ని గ్రామాల్లోని విద్యార్థులను పరీక్షించి, వారికి అవసరమైన యునాని మాత్రలను అందజేశారు.

### ప్రభుత్వం ప్రత్యేక దృష్టి



తెలంగాణ ప్రభుత్వం ఆయుష్‌పై ప్రత్యేక దృష్టి సారించింది. గ్రామాల్లో ఆయుష్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుండడంతో దవాఖానకు నిత్యం 30 మందికి పైగా వివిధ సమస్యలతో వస్తున్నారు. ఈ వైద్య విధానంపై గ్రామీణులకు మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

*- ఎండీ అప్సానా, యునాని వైద్యాధికారి (చిగురుమామిడి)*

## కానిస్టేబుల్‌గా ఎంపికైన యువకుడికి సన్మానం



రవిశంకర్‌ను సన్మానిస్తున్న నాయకులు, గ్రామస్తులు

తిమ్మాపూర్ రూరల్, అక్టోబర్ 7: మండలంలోని మన్నెంపెల్లి గ్రామానికి చెందిన నాంపల్లి రవిశంకర్ ఇటీవల విడుదలైన పోలీస్ కానిస్టేబుల్ ఫలితాల్లో సీఎస్‌ఎస్‌పీ బెటాలియన్ కానిస్టేబుల్‌గా ఎంపిక కాగా, శనివారం ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం మండలాధ్యక్షుడు పారునంది జలపతి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. శాలువా కప్పి, బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ మేడి అంజయ్య, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎస్‌ఐ నరసింహారావు

గన్నేరువరం రూరల్, అక్టోబర్ 7: లయన్స్ క్లబ్ ఆఫ్ గన్నేరువరం ఆధ్వర్యంలో మండలకేంద్రంలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌ఐ చందా నరసింహారావు సూచించారు. మండల కేంద్రంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 5 నుంచి నిర్వహిస్తున్న అక్యుప్రెషర్ అండ్ మ్యాగ్నెటిక్ థెరపి చికిత్స శిబిరాన్ని శనివారం ఎస్‌ఐ సందర్శించారు. ఈ సందర్భంగా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. పేద ప్రజల కోసం ఉచితంగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్న లయన్స్ క్లబ్‌ను అభినందించారు. కార్యక్రమంలో జోన్ చైర్మన్ బొడ్డు సునీల్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కొండల్ రెడ్డి, వైస్ ఎంపీపీ న్యాత స్వప్నాసుధాకర్, ఉప సర్పంచ్ బూర వెంకటేశ్వర్, బూర రామకృష్ణ, మీసాల ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.